# <u>పత్రికా ప్రకటన</u>

తేది.09.02.2018.

## <u>నకిలీ కరెన్సీ మార్చేందుకు ప్రయత్నిస్తున్న ముగ్గురు నిందితుల అరెస్ట్</u>

## *రూ. 12,03,500/-ల నకిలీ, రూ.53,500/ల అసలు కరెన్సీ స్వాధీనం*

కలర్ ప్రింటర్ సహాయంతో నకిలీ కరెన్సీ తయారు చేసి, వాటిని మార్కెట్‌లో చలామని చేసేందుకు ప్రయత్నిస్తున్న ముగ్గురు నిందితులను **<u>1) పల్లె రాఘవరెడ్డి, 2) బండి రాజు మరియు 3) అడబాల ఆంజనేయ మూర్తి</u>**లను కృష్ణలంక ఇన్‌స్పెక్టర్ గారికి అందిన పక్కా సమాచారంతో ది9.2.18న చాకచక్యంగా అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి రూ.500/-లు నోట్లు కలిగిన రూ.12,03,500/-ల నకిలీ కరెన్సీని మరియు రూ.53,500/-ల అసలు కరెన్సీని స్వాధీనం చేసుకోవడంతో పాటు నకిలీ తయారీకి ఉపయోగిస్తున్న కలర్ ప్రింటర్‌ను స్వాధీనం చేసుకోవడం జరిగింది.

కర్నూలు జిల్లా ఢోన్ మండలానికి చెందిన పల్లె రాఘవరెడ్డి అలియాస్ రఘునాథ్ రెడ్డి (50) అనే వ్యక్తి వ్యవసాయం చేస్తాడు. వ్యవసాయానికి పెట్టుబడి పెట్టి పంట నష్టపోవడంతో రాఘవరెడ్డి స్థానికంగా అప్పుల పాలయ్యాడు. ఈ క్రమంలో తనకు తెలిసిన ఒక వ్యక్తి (పరారీలో ఉన్నాడు) వద్దకు వచ్చి అప్పులపాలైన విషయం తెలియజేసి ఏదైనా ఆర్థికంగా సహాయం చేయమని రాఘవరెడ్డి కోరాడు. దీన్ని ఆసరాగా తీసుకున్న ఆ వ్యక్తి నకిలీ కరెన్సీ చలామణి చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని సలహా ఇవ్వడంతో పాటు తణుకు చెందిన బండి రాజు (35) మరియు అడబాల ఆంజనేయ మూర్తి (62)లను రాఘవరెడ్డికి పరిచయం చేశాడు. బండి రాజుపై తూర్పు గోదావరి జిల్లా దవళేశ్వరంలో నకిలీ కరెన్సీకి సంబంధించి కేసు మరియు చెక్‌బౌన్స్ కేసులు నమోదై ఉన్నాయి. అలాగే అడబాల ఆంజనేయ మూర్తిపై విజయవాడ పోలీస్ కమీషనరేట్ పరిధి మాచవరం మరియు గన్నవరం పోలీస్‌స్టేషన్లతో పాటు కైకలూరు, పాలకొల్లు, నర్సాపురం, భీమవరం, ఒంగోలు మరియు హైదరాబాద్ లలో నకిలీ కరెన్సీ చలామణికి సంబంధించి మొత్తం 11 కేసులు నమోదు కాగా, ఈ కేసులకు సంబంధించి పలుమార్లు జైలుకు వెళ్ళడం బెయిల్‌పై బయటకు వచ్చాడు.

సుమారు నెల రోజుల క్రితం తణుకు వెళ్ళిన రాఘవరెడ్డి అక్కడ ఆంజనేయ మూర్తి మరియు బండి రాజులను కలుసుకుని, వారి వద్ద ఉన్న నకిలీ రూ.500/-ల కరెన్సీ నోట్లును పరిశీలించాడు. రూ.1 లక్ష నకిలీ కరెన్సీకి రూ.30 వేల అసలు కరెన్సీ ఇచ్చే విధంగా ఆంజనేయ మూర్తి మరియు బండి రాజులతో ఒప్పందం చేసుకున్న రాఘవరెడ్డి డబ్బు తీసుకుని మరలా వస్తానని, అప్పటికి రూ.5 లక్షల నకిలీ కరెన్సీ సిద్ధం చేయమని తెలియజేసి అక్కడి నుండి తిరిగి తన స్వగ్రామం చేరాడు. ఈ క్రమంలో ది.7.2.18న రాత్రి డోన్ నుండి బయలుదేరిన రాఘవరెడ్డి ది.8.2.18న తణుకు చేరుకున్నాడు. తణుకు బస్‌స్టాండ్ సమీపంలో ఉన్న ఒక ఖాళీ ప్రదేశంలో ఆంజనేయ మూర్తి మరియు మరియు బండి రాజులకు రూ.1.50 లక్షల అసలు కరెన్సీని ఇచ్చి అందుకు బదులు రూ.4.50 లక్షల నకిలీ కరెన్సీని రాఘవరెడ్డి తీసుకోవడం జరిగింది. అనంతరం అక్కడి నుండి బస్‌లో బయలుదేరి ది.8.2.18న సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టాండ్‌కు చేరుకున్నాడు. తాను తీసుకున్న నకిలీ రూ.500/-ల నోట్లు మార్చేందుకు పండిట్ నెహ్రూబస్‌స్టాండ్‌లో రెండు మూడు దుఖాణాల్లో ప్రయత్నించి, దుఖాణదారులు నకిలీవని తెలియజేయడంతో వారికి అనుమానం రాకుండా ఉండేందుకు నకిలీ కరెన్సీని తిరిగి తీసుకుని తన వద్ద ఉన్న అసలు కరెన్సీని ఇచ్చి వాటర్ బాటిల్‌ను కొనుగోలు చేయడం జరిగింది. ఈ క్రమంలో కృష్ణలంక ఇన్‌స్పెక్టర్ గారికి అందిన సమాచారంతో బస్‌స్టాండ్‌కు చేరుకున్న పోలీసులు తొలుత రాఘవరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించడంతో నకిలీ కరెన్సీ గురించిన సమాచారం వెలుగు చూసింది.

ఈ నేపథ్యంలో రాఘవరెడ్డి ఇచ్చిన సమాచారంతో తణుకు చేరుకుని అక్కడ ఆంజనేయ మూర్తి మరియు బండి రాజులను కూడా అరెస్ట్ చేసి, బస్‌స్టాండ్‌లో రాఘవరెడ్డి వద్ద రూ.4,29,500/-లు మరియు తణుకు బండి రాజు ఇంట్లో రూ.7,74,000/-లు మొత్తం కలిపి రూ.500/-లు నోట్లు కలిగిన రూ.12,03,500/-ల నకిలీ కరెన్సీని మరియు రూ.53,500/-ల అసలు కరెన్సీని స్వాధీనం చేసుకోవడంతో పాటు నకిలీ తయారీకి ఉపయోగించిన ఎప్సాన్ కంపెనీ కలర్ ప్రింటర్‌ను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ కేసులో పరారీలో ఉన్న మరో వ్యక్తిని పట్టుకునేందుకు చర్యలు తీసుకోవడం జరిగింది.

-- xx --